

కాణిపాకం భక్తజనసంద్రం

కాణిపాక వినాయకస్వామి ఆలయం గురువారం భక్తసంద్రమైంది. ఆలయం వెలుపలి వరకు భక్తులు బారులు తీరారు. - 8లో



వాహన మిత్ర..ఆర్థిక భరోసా

ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు వైఎస్సార్ వాహన మిత్రతో ప్రభుత్వం ఏటా ఆర్థిక భరోసా ఇస్తోంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	32	24
తిరుపతి	34	25
తిరుమల	29	21
గూడూరు	36	26
నగరి	34	25

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ వాహన మిత్ర

- ఏర్పాట్లు పూర్తి..హాజరుకానున్న మంత్రులు



షణ్మోహన్, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఐదో విడత జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు, ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సొంత వాహనం కలిగిన ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్‌లకు ఇన్సూరెన్స్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, మరమ్మతులు ఇతర అవసరాల నిమిత్తం ప్రభుత్వం వాహనమిత్ర పథకం కింద ఏటా రూ.10 వేలు సాయం చేస్తోందని పేర్కొన్నారు. 2023–24కు సంబంధించి జిల్లాలో పథకానికి దరఖాస్తు చేసుకున్న అర్హులు 6,482 మందికి రూ.6,48, 20, 000 అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ అభ్యర్థులకు నేరుగా లెర్నింగ్ మెటీరియల్

చిత్తూరు కలెక్టరేట్ : ఓపెన్ స్కూల్ అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు లెర్నింగ్ మెటీరియల్ నేరుగా పంపుతామని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులకు పాఠ్యపుస్తకాలు, లెర్నింగ్ మెటీరియల్, పాస్ సర్టిఫికెట్స్, మైగ్రేషన్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్‌లు నేరుగా పంపేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ విషయాన్ని అభ్యర్థులకు ఆయా స్టడీ సెంటర్‌ల ఏ1 కోఆర్డినేటర్‌లు తెలియజేయాలని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు అక్టోబర్ నుంచి 2024 మార్చి వరకు 30 షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని పేర్కొన్నారు.

4 టన్నుల కూరగాయల వితరణ



కూరగాయలను అందిస్తున్న దాతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదాన పథకానికి గురువారం నాలుగు టన్నుల కూరగాయలు వితరణగా అందాయి. చింతామణికి చెందిన సోమశేఖర్, గంగాధర్ 12 రకాల 4 టన్నుల కూరగాయలను సేకరించి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబును కలిసి వాటిని అందించారు. దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

- చిత్తూరు జిల్లా, గుడిపాల మండలానికి చెందిన నారాయణమూర్తి గుడిపాల పంచాయతీ సర్పంచ్. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. రెండు నెలల క్రితం ఈయనకు ఉన్నట్టుండి గుండె పోటు వచ్చింది. వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం చిత్తూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు సీఎంసీకి రెఫర్ చేశారు. అక్కడికెళ్లేలోపే మరణించినట్లు కుటుంబీకులు బోరుమంటున్నారు.
- తిరుపతి నగరానికి చెందిన యుగంధర్(41) ప్రయివేటు కంపెనీ ఉద్యోగి. ఇతనికి భార్య, ఇద్దరు ఆడ బిడ్డలు ఉన్నారు. గత నెలలో ఉదయం పూట ఇంట్లో పనిచేస్తున్నారు. శరీరమంతా విపరీతంగా చెమట పట్టింది. నీళ్లు సరిగా తాకపోవడం వల్ల అనుకుని నిర్లక్ష్యం చేశాడు. ఆపై గుండె నొప్పి మొదలైంది. కుటుంబ సభ్యులు సమీపంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను ప్రాణాలు కోల్పోయినట్టు అక్కడి డాక్టర్లు నిర్ధారించారు. అంతకుముందు కనీసం బీపీ, షుగర్ వంటి సమస్యలు కూడా లేవని.. కేవలం పని ఒత్తిడి వల్లే రాత్రుల్లో సరిగా నిద్రపోక ఇబ్బందిపడేవారని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.



మదికలవరం

హృదయాన్ని ఎంత భద్రంగా ఉంచుకుంటే అంత ఆరోగ్యంగా ఉండవచ్చు. కానీ మారుతున్న జీవనశైలి, యాంత్రిక జీవనం, పెరుగుతున్న మానసిక ఒత్తిడి, సమయ పాలనలేని ఆహారం, శరీర బరువుపై అదుపు కోల్పోవడం, వైద్య పరీక్షలను నిర్లక్ష్యం చేయడం వల్ల గుండె సమస్యలు అధికమవుతున్నాయి. వీటితో పాటు మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయ సమస్యలూ గుండెను కోలుకోనీయకుండా చేస్తున్నాయి. గుండె నాళాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటూ దెబ్బతీస్తున్నాయి. వయసుతో నిమిత్తం లేకుండా మనిషి ప్రాణాలను బలి తీస్తున్నాయి. వారిపైనే ఆధారపడ్డ కుటుంబీకులను వీధిన పడేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో గుండెను భద్రంగా ఉంచుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నేడు హార్ట్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న గుండె పోటు బాధితులు
- 25 ఏళ్లకే హార్ట్‌స్ట్రోక్‌కు గురవుతున్న యువకులు
- మారిన ఆహార నియమాలు, అలవాట్లతోనే ముప్పు
- శారీరకశ్రమ లేకపోవడం, పని ఒత్తిడే కారణం
- ఏటా 10–20 శాతం పెరుగుతున్న వైనం
- నేడు వరల్డ్ హార్ట్ డే

చిత్తూరు రూరల్: ఉమ్మడి జిల్లాలో సుమారు 46 లక్షల మంది జనాభా ఉన్నారు. గత ఏడాది ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు ఎన్‌సీడీ సర్వేలో భాగంగా 42 లక్షల మందిని పరీక్షించారు. అందులో 12,02,431 మంది మధుమేహం, 1,96,772 మంది రక్తపోటుతో బాధపడుతున్నట్లు తేలింది. బీపీ, షుగర్ రెండూ ఉన్నవారు సుమారు 80 వేల మంది వరకు ఉన్నారు. అలాగే 12 వేల మంది గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. అవగాహన లేమితో చాలామంది చికిత్సకు దూరంగా ఉంటూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు.

కోవిడ్‌తో అల్లకల్లోలం

కోవిడ్ తర్వాత గుండె సంబంధిత చికిత్సల కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇందులో మగవారు 22శాతం, మహిళలు 13 శాతం మంది ఉన్నారు. ప్రస్తుతం 25 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు గుండె సమస్యలతో బాధపడుతున్నారు. ఆస్పత్రికి వచ్చే 100 రోగులలో 70 శాతం మంది గుండె సంబంధిత రోగాలతో ఇబ్బంది పడుతున్నారు.

కారణాలివే

- చదువులో, విధుల్లో తీవ్రమైన ఒత్తిడికి (స్ట్రెస్)
- స్మోకింగ్, ఆల్కహాల్ సేవించడం
- ఫాస్ట్‌ఫుడ్, రక్తంలో చెడు కొలస్ట్రాల్ ఎక్కువగా ఉండడం
- 20 ఏళ్లకే మధుమేహం వచ్చినా గుర్తించకపోవడం
- తల్లిదండ్రులు ఇద్దరికీ గుండె జబ్బులు ఉండడం
- వాతావరణ కాలుష్యం
- కోవిడ్ బారిన పడిన వారి రక్తనాళాల్లో క్లాట్స్ ఏర్పడడం

లక్షణాలు

- గుండె పోటుకు ముందు శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది
- గాలి పీల్చుకోవడం ఇబ్బందిగా మారుతుంది
- గుండెలో మంటగా ఉంటుంది
- తరచూ జలుబు, జ్వరం, దగ్గు వస్తున్నా.. అవి ఎంతకీ తగ్గకపోవడం
- గుండె భారంగా.. అసౌకర్యంగా..
- మత్తుగా, మగతగా, చెమటలు ఎక్కువగా..
- తీవ్రమైన అలసట, ఒళ్లు నొప్పులు
- వికారం, ఆహారం జీర్ణం కాకపోవడం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలు
- కాళ్లు, పాదాలు, మడతలు ఉబ్బుతాయి
- శరీరం పైభాగం నుంచి ఎడమ చేతికింద వరకు నొప్పిగా అనిపిస్తుంది

గుండె జబ్బులు...రకాలు

గుండె జబ్బులు మూడు రకాలు. కంజినెటల్ (పుట్టుకతో వచ్చేవి) హార్ట్ డిసీజ్, రుమాటిక్ హార్ట్ డిసీజ్, కరొనరీ ఆర్టరీ డిసీజ్. అయితే, ప్రతి వంద గుండె జబ్బుల్లో 90 కరొనరీ ఆర్టరీ డిసీజ్‌లే ఉంటున్నాయి. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే వ్యవస్థలో అడ్డంకులు ఏర్పడితే దాన్ని ఆర్టరీ డిసీజ్‌గా పేర్కొంటారు. దీనివల్ల గుండెకు ఆక్సిజన్, పోషక పదార్థాల సరఫరా నిలిచిపోయి కండరాలు చచ్చుబడిపోతాయి. దీన్నే హార్ట్ ఎటాక్, మయో కార్డియల్ ఇంప్రెషన్‌గా పిలుస్తుంటారు.



ఏంచేయాలంటే

- జీవనశైలిని మార్చుకోవాలి
- పనిలో ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి
- యోగా, ధ్యానం వంటి వాటిపై దృష్టి సారించాలి
- రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- తల్లిదండ్రులకు గుండె జబ్బులు ఉన్న వారు వయస్సు 30 ఏళ్లు దాటిన తర్వాత హార్ట్ చెకప్ తరచూ చేయించుకోవాలి.
- ఆరోగ్యకమైన ఆహారం తీసుకోవాలి.
- ఫాస్ట్‌ఫుడ్, నూనె ఎక్కువగా వినియోగించిన ఆహారం తీసుకోరాదు.

ఉమ్మడి జిల్లాలో గుండె జబ్బుల ఓపీలు

నెల	ఓపీల సంఖ్య
మే	6,735
జూన్	7,102
జూలై	6,934
ఆగస్టు	8,002
సెప్టెంబర్	7,065

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రులు	2
టీచింగ్ ఆస్పత్రులు	2
పీహెచ్‌సీలు	104
సీహెచ్‌సీలు	17
ఏరియా ఆస్పత్రులు	5
ప్రైవేటు హాస్పిటళ్లు	2 వేలకు పైగా

ఆరోగ్య నియమాలు పాటించాలి



కోవిడ్ వల్ల గుండె సంబంధిత సమస్యలు పెరిగాయి. గతంలో అధిక కొలెస్ట్రాల్, బీపీ, షుగర్, మద్యం, సిగరెట్ వల్ల సమస్య ఉండేది. ఇప్పుడు ఊబకాయం పెరిగి చిన్న వయస్సులోనే గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయి. ఉద్యోగులు పనులు పూర్తి చేసుకొని ఎలాంటి వ్యాయామం లేకుండా నిద్రపోవడం వల్ల తెలియకుండానే కొవ్వు పెరిగి రక్తంలో బ్లాక్స్ ఏర్పడుతాయి. దీంతో గుండె, మెదడు స్ట్రోక్ వస్తోంది. రోజూ 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.

– డాక్టర్ నాగరాజ్‌కుమార్, గుండె వైద్య నిపుణులు

థ్యాంక్యూ సీఎం సార్..

చిత్తూరు రూరల్: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయడంపై థ్యాంక్యూ సీఎం సార్ అంటూ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయ కాంట్రాక్ట్ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేశారు. తొలుత చిత్తూరు జెడ్పీ ఆవరణలోని దిగవంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, సతీష్, శరత్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించండం హర్షణీయమన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వివిధ విభాగాల్లో 256 మంది క్రాంటాక్ట్ పద్ధతిలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్ల తాము చేసిన పోరాటాలను నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఆనందం వ్యక్తం చేశారు. ఉద్యోగులు అయ్యప్ప, సుబ్రమణ్యం, సురేష్‌రాజు, గణేష్, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.




హర్షం వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

రూ.2.18 కోట్ల విద్యుత్ బిల్లుల వసూలు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లుల ద్వారా గురువారం రూ.2.18 కోట్లు వసూలైనట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వం సెలవు దినం అయినప్పటికీ గురువారం బిల్లుల కేంద్రాలు పని చేశాయని పేర్కొన్నారు. 18,237 మంది వినియోగదారులు బిల్లులు చెల్లించగా రూ.2.18 కోట్లు వచ్చినట్లు వివరించారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

శివశివమూర్తివి గణనాథా..

- నందిపై దేవదేవేరుల విహారం
- ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో వేద స్వదశం పాల్గొన్న ప్రముఖ దేవాలయాల నుంచి విచ్చేసిన పండితులు

కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రత్యేక ఉత్సవాలు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు స్వామివారికి 14 గ్రామాలకు చెందిన వారు ఉభయదారులుగా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. రోజుకో వాహనంపై స్వామివారు పురవీధుల్లో విహరిస్తారు. గురువారం అధికార నంది వాహనంపై భక్తులను అనుగ్రహించారు.

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వినాయక చవితి నుంచి దేవస్థానం ఆధ్వర్యంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరిగాయి. బుధవారం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాల అనంతరం ఉభయదారుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఉత్సవాలు జరగడం సంప్రదాయం. ఆమేరకు గురువారం ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేకువజామున మూలస్థానంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత గణనాథుని ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి పట్టు పీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి ఆలయ అధికారులు, ఉభయదారులు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువెళ్లి అధికార నంది వాహనంపై కొలువుదీర్చగా, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. అలాగే ఆలయంలో వేద స్వదశం కార్యక్రమం జరిగింది. కార్యక్రమాలను దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఉభయదారులుగా కాణిపాకానికి చెందిన వళ్లువర్ వంశస్తులు వ్యవహరించారు.



సింగిరిగుంట సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

నాలుగేళ్లలోనే 30 ఏళ్ల అభివృద్ధి

పుంగనూరు నియోజకవర్గంలో 30 ఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగేళ్లలో చేపట్టినట్లు రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పుంగనూరు నియోజకవర్గ ప్రజలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రేమతో ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా తాగునీరు అందించే పనులు మంజూరు చేశారని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. గురువారం పుంగనూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్య అతిథులుగా మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప పాల్గొని ప్రారంభించారు. సింగిరి గుంట సభలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పుంగనూరు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. గండికోట నుంచి రూ.2800 కోట్లతో పైపులైన్ల ద్వారా పుంగనూరుకు నీరు అందిస్తామన్నారు.

- పుంగనూరు నియోజకవర్గంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి
- రూ.2800 కోట్లతో గండికోట నుంచి పైపులైను
- ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం
- పలు ప్రారంభోత్సవాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: పడమటి నియోజకవర్గాలకు తాగునీరు–సాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. సింగిరిగుంట సభలో మంత్రి మాట్లాడుతూ రూ.1500 కోట్లతో మూడు రిజర్వాయర్లను సీఎం మంజూరు చేశారని తెలిపారు. నేతిగుట్లపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్ల ద్వారా పడమటి నియోజకవర్గాలలో కరువును పారదోలి, సస్యశ్యామలం చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. చంద్రబాబు అండ్‌కో నీచ బుద్ధితో రిజర్వాయర్లపై స్టేలు తెచ్చి పనులు ఆపివేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఎన్నికల లోపు రిజర్వాయర్లు పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తామన్నారు. పుంగనూరులో 30 సంవత్సరాలుగా ఎంపీ, ఎమ్మెల్యేలుగా ఉన్న వారు ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదని మంత్రి విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పుంగనూరు అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను చూసి ఆయనకు అండగా నిలవాలని కోరారు.

రైతులకు పరికరాలు అందజేత

డ్వామా ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 2,573 మంది రైతులకు రూ.4.83 కోట్లతో మంజూరైన వ్యవసాయ పరికరాలను మంత్రి పెద్దిరెడ్డి పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడితో పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. డ్వామా పీడీ గంగాభవాని, ఏపీడీ ఉమావాణి పాల్గొన్నారు.

సున్నావడ్డీ రుణాల పంపిణీ

మండలంలోని 23 పంచాయతీల్లోని 1,325 మహిళా సంఘాలకు మంత్రి పెద్దిరెడ్డి సున్నా వడ్డీ రుణాల కింద రూ.1.52 కోట్లు చెక్కును పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుంటూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మంత్రి కోరారు.

ధరల స్థిరీకరణ బృహత్తర కార్యక్రమం

దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న ఆలోచనలతో బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి ధరల స్థిరీకరణనిధికి రూ.3వేల కోట్లు కేటాయించారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. పాలెంపల్లెలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంటలకు గిట్టుబాట ధర కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎరువులు, విత్తనాలు, రైతులకు సలహాలు, సూచనలు రైతుభరోసా కేంద్రాల నుంచి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల ముంగిటకే సేవలు అందించేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 2 వేల జనాభాకో సచివాలయాన్ని ఏర్పాటు చేసి, వలంటీర్ల ద్వారా ప్రజలకు సేవలు అందింస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల వారికే సంక్షేమ పథకాలు అందాయని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదరికమే ప్రామాణికంగా పథకాలు సచివాలయాల ద్వారా పారదర్శకంగా అందిస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు.

ప్రారంభోత్సవాలు..

పుంగనూరు మండలంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సింగిరిగుంట, శాంతినగర్, చదళ్ల, బసివినాయునిపల్లెలో ఆర్‌బీకేలను, సింగిరిగుంట, ఆరడిగుంట, బసివినాయునిపల్లె, సుగాలిమిట్ట, ఇటుకనెల్లూరు, పాలెంపల్లెలో వైఎస్సార్ హెల్త్ సెంటర్లను, కురప్పల్లె, కీలకిరి, కుమ్మరగుంట, బసివినాయునిపల్లె, మాగాండ్లపల్లె, మేలుందొడ్డి, రాంపల్లె, ఎంసీపల్లె, తాండా, ఏఎస్‌కుంట, చదళ్ల, ఏతూరు, నల్లగుట్టపల్లెలో వాటర్‌ప్లాంట్లను, చదళ్లలో సచివాలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. మండలంలో మొత్తం 26 అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు.



పుంగనూరు సభకు హాజరైన మహిళలు



సున్నా వడ్డీ రుణాల చెక్కు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



నేడు విజయపురంలో జగనన్నకు చెబుదాం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నగరి నియోజకవర్గం విజయపురంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయపురం ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా అధికారులు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని చెప్పారు.

పాచిన వంటలు.. కుళ్లిన మాంసం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలోని ప్రైవేట్ హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ, ప్రజారోగ్యశాఖ అధికారులుదాడులు చేసిన ప్రతిసారీ ఒళ్లు గగుర్పొడిచే విషయాలు వెలుగుచూస్తున్నాయి. స్థానిక లక్ష్మీపురం కూడలి సమీపంలోని పెట్రోల్ బంకు వెనుక వైపు ఉన్న ఓల్డ్ టౌన్ హోటల్‌పై ఫిర్యాదులు రావడంతో ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు గురువారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వంట గది, పరిసర ప్రాంతాలు, ఫ్రీజ్‌లలో పాచిన ఆహార పదార్థాలు, కుళ్లిన మాంసం, నాణ్యతలేని కూరగాయలను గుర్తించారు. నిల్వ ఉన్న మాంసాన్ని శాంపుల్స్‌కు తీసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ మీడియాతో మాట్లాడుతూ హోటల్ నుంచి మటన్ ఆర్డర్ చేయగా అందులో దుర్వాసన వచ్చిందని ఒక వ్యక్తి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారని తెలిపారు. అతనికి వాంతులు కావడంతో రుయాలో చికిత్స తీసుకున్నారని చెప్పారు. ఫిర్యాదు ఆధారంగా ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి ఓల్డ్ టౌన్ హోటల్‌పై దాడులు చేశామన్నారు. ఇందులో నాణ్యతలేని, నిల్వ ఉన్న చికెన్, మటన్‌ను గుర్తించామన్నారు. శాంపిల్స్ సేకరించామని, ల్యాబ్‌కు పంపించి నాణ్యతను పరిశీలిస్తామని తెలిపారు. నాణ్యత, కిచెన్ పరిశుభ్రంగా లేనందున వారికి భారీ జరిమానా విధించామని చెప్పారు. తిరుపతికి నిత్యం వేలాది మంది యాత్రికులు వస్తుంటారని, వారికి నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటల్ యజమానులపై ఉందన్నారు. ప్రైవేట్ హోటళ్లపై నిరంతరం దాడులు చేస్తామని, అపరిశుభ్రంగా, నాణ్యతలేని వంటకాలు అందిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనమిత్ర..ఆర్థిక భరోసా..!

ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసానిస్తోంది. రవాణా శాఖకు సంబంధించిన ఖర్చుల నిమిత్తం ఏటా రూ.10 వేల చొప్పున అందిస్తోంది. శుక్రవారం ఐదో విడత వాహనమిత్ర సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వాహనానికి బీమా, ఫిట్నెస్ సర్టిఫికెట్, చిన్నపాటి మరమ్మతులకు ఈ మొత్తం ఉపయోగపడుతుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



- నేడు ఐదో విడత వైఎస్సార్ వాహనమిత్ర పథకం అమలు
- ఈసారి ఎండీయూ ఆపరేటర్లకు కూడా పథకం వర్తింపు
- జిల్లాలో 6,482 మంది లబ్ధిదారులు
- రూ.6 కోట్ల మేర లబ్ధి పొందే అవకాశం

చిత్తూరు రూరల్: ఆటో, ట్యాక్సీవాలాలకు ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ప్రభుత్వం చేయూతనందిస్తోంది. జిల్లాలో నాలుగో విడతగా 6,044 మంది లబ్ధిదారులకు రూ. 6.49 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. నాలుగు విడతల్లో ఒక్కో లబ్ధిదారుడు రూ.40 వేల లబ్ధిపొందారు. ఈ ఏడాది ఐదో విడత జిల్లాలో 6,482 మంది లబ్ధిదారులు ఉండగా వారి ఖాతాల్లో రూ.6,48,20,000 కోట్ల నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేయనున్నారు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద 2023–24లో కొత్తవారికి అవకాశం కల్పిస్తూ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవడానికి ఆహ్వానించారు. గతనెల 12వ తేదీ వరకు అవకాశం ఇవ్వగా.. చాలామంది ఆటో, టాక్సీ డ్రైవర్లు వినియోగించుకున్నారు. కొత్తగా ఆటో, ట్యాక్సీ, మాక్సీక్యాబ్ కొనుగోలు చేసిన డ్రైవర్లు వినియోగించుకున్నారు. ఈ ఏడాది రేషన్ డోర్ డెలివరీ చేస్తున్న రేషన్ వాహనాల (ఎండీయూ) ఆపరేటర్లకు కూడా వాహనమిత్ర సాయం అందించనున్నారు. ఈ మేరకు 336మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. వీరికి రూ.33.60 లక్షలు అందించనున్నారు.

అర్హతే ప్రామాణికం

అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ వాహనమిత్ర పథకానికి లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేసింది. వాహన లబ్ధిదారులు తమ వాహనం వద్ద ఫొటో తీసుకుని గ్రామ, వార్డు సచివాలయంలో నమోదు చేసి దరఖాస్తు చేసుకున్నారు. కొత్త వాహనం కొనుగోలు చేసిన డ్రైవర్లు, ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, భూమి వివరాలు, ఆదాయ పన్ను, ఇంటి విద్యుత్ వినియోగం, కులం ఇతర వివరాలు దరఖాస్తుతో అందజేసి అర్హులుగా లబ్ధిపొందుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో...

ఐదో విడత వాహన మిత్ర జిల్లా స్థాయి కార్యక్రమం చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల వివరాలు:

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య
చిత్తూరు	1356
గంగాధరనెల్లూరు	837
కుప్పం	564
నగిరి	281
పలమనేరు	873
పుంగనూరు	1586
పూతలపట్టు	985
మొత్తం	6,482

సీఎంకు రుణ పడి ఉంటాం..



ఏటా వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాయం అందించడం ఆనందంగా ఉంది. రూ.10 వేల సాయం నాకు ఎంతో ఉపయోగపడనుంది. ఈ మొత్తాన్ని వాహనం బ్రేక్, బీమా, నిర్వహణ ఖర్చులకు ఉపయోగించుకుంటా. ఈ సారే నేను కొత్తగా దరఖాస్తు చేసుకున్నా. అర్హుల జాబితాలో పేరు ఉంది. సీఎంకు రుణపడి ఉంటా.

-హరి, పెరుమాళ్లకండ్రిగ, చిత్తూరు

ఆనందంగా ఉంది...



వైఎస్సార్ వాహనమిత్ర కింద ఇప్పటికే నాలుగు విడతల్లో రూ.40 వేల సాయం పొందాను. ఈ ఏడాది మరో రూ.10 వేలు లబ్ధి అందుకోనున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటప్రకారం క్రమం తప్పకుండా వాహనమిత్ర సాయం అందించడం సంతోషంగా ఉంది.

- చిట్టిబాబు, తాళ్లంబేడు, చిత్తూరు

పారదర్శకంగా ఎంపిక



జిల్లాలో వైఎస్సార్ వాహనమిత్ర ఐదో విడతకు సంబంధించి లబ్ధిదాలను పారదర్శకంగా ఎంపిక చేశాం. ఈ పథకం కింద 6,482 మంది లబ్ధిదారులకు రూ.6 కోట్ల లబ్ధి కలుగనుంది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ వాహన మిత్ర పథకానికి ఎంపికచేశాం. ఆటో, మ్యాక్సీ, టాక్సీ డ్రైవర్లకు వాహనాల నిర్వహణ, ఇన్సూరెన్స్ ప్రీమియం, ఫిట్నెస్ ఫీజులు చెల్లించేందుకు పథకం ఆర్థికంగా దోహదపడుతోంది.

-నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.59,500
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,500
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.73,000
రిటైల్ వెండి గ్రాము రూ.75.00

కర్ణాటక మద్యం సీజ్.. ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అర్బన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ జోగేంద్ర కథనం మేరకు.. నగరంలోని సంతపేటలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు ఎస్ఈబీ పోలీసులకు సమాచారం అందింది. సీఐ, ఎస్ఐలు బాబు, రామ్‌ప్రసాద్ సిబ్బంది కలిసి సంతపేటలో తనిఖీలు నిర్వహించారు. దొంగలబావి వీధికి చెందిన పరదేశి కుమారులైన పి.కుట్టి (26), పి.రఘు (24) కర్ణాటక మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి 21 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్టు చూపి, న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది శంకరనాయక్, జయశంకర్, సురేంద్ర, వెంకటేష్, సాలాక్షి, శైలజ పాల్గొన్నారు.

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకుందాం



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఐక్యంగా పోరాడి సమస్యలు పరిష్కరించుకుందామని ఆల్ ఇండియా ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సందీప్ కుమార్ మౌర్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ భవనంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించుకునేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశాల్లో చర్చించే అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పన్నీర్ సెల్వం మాట్లాడుతూ జీవో నెంబర్ 5 రద్దు, ప్రభుత్వ శాఖల్లో కొత్త డ్రైవర్ పోస్టుల మంజూరు, స్వచ్ఛభారత్ వాహనాలకు డ్రైవర్ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం సందీప్ కుమార్ మౌర్య, సౌత్ వెస్ట్ జోన్ చైర్మన్ సర్దార్ మంజీత్ సింగ్, నాగేశ్వరరావును సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. సభ్యులు షణ్ముగం, రామన్న, సురేష్ బాబు, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం..భక్త జనసంద్రం



విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు



వెండి తట్ట అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం గురువారం భక్తులతో కిటకిట లాడింది. ప్రభుత్వ సెలవు రోజు, తిరువణ్ణామలైకు వెళ్లే భక్తులు అశేషంగా తరలి రావడంతో కంపార్ట్‌మెంట్‌లు, రూ.150, రూ.100, ఉచిత క్యూలు నిండిపోయి ఆరు బయట వరకు భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, చంటిబిడ్డల తల్లులను ప్రత్యేక క్యూల్లో దర్శనానికి అనుమతించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గురువారం రూ.లక్ష విరాళం అందింది. బంగారుపాళ్యం, మండలం తిమ్మోజిపల్లె గ్రామానికి చెందిన సాయివిగ్నేష్ కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి అధికారులకు విరాళం అందించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

వెండి తట్ట బహూకరణ

శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి అన్నమయ్య జిల్లా వాల్మీకిపురానికి చెందిన శాంతాచారి రూ.85 వేలు విలువజేసే వెండి తట్టను కానుకగా అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు.

నేడు రావణబ్రహ్మ వాహనం

వినాయకస్వామి ఆలయ ప్రత్యేక ఉత్సవాలలో శుక్రవారం స్వామివారు రావణ బ్రహ్మ వాహనంపై విహరించనున్నారు. ఉదయం మూలస్థానంలోని గణనాథునికి అభిషేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు.

రెండు రోడ్డు ప్రమాదాలు-ఐదుగురికి గాయాలు





పుత్తూరు బైపాస్ రోడ్డులో తీవ్రంగా గాయపడ్డ రమేష్ , పుత్తూరు పట్టణంలో కారును ఢీకొన్న లారీ

పుత్తూరు రూరల్: పట్టణ పరిధిలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడగా, ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు... బుధవారం రాత్రి స్థానిక బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వై.రమేష్ (45)కు తలపై తీవ్ర గాయం కావడంతో తిరుపతి రుయాకు తరలించారు. తలలో బ్లెడ్ క్లాట్ అయినట్లు డాక్టర్లు చెప్పడంతో బంధువులు తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తిరుపతిలో నివాసంఉంటున్న రమేష్ మోటర్ సైకిల్‌పై భార్యతో పుత్తూరుకు వచ్చి, బావమరిది ఇంట్లో భార్యను వదిలి, తిరుగు ప్రయాణమయ్యాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొడంతో ప్రమాదం జరిగింది. గురువారం ఉదయం స్థానిక నారాయణవనం రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్కిల్ వద్ద నగరి నుంచి తిరుమలకు వెళ్తున్న కారును సత్యవేడు నుంచి తిరుపతికి వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మహావీర్, నిష, సూరజ్‌తో పాటు డ్రైవర్ నవీన్‌కుమార్‌కు గాయాలయ్యాయి. వీరందరినీ పుత్తూరు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం చెన్నైకి తరలించారు. లారీ డ్రైవర్ శివమూర్తిని అదుపులోకి తీసుకుని, పుత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి దూకి బిడ్డ సహా ..

తల్లి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో కోలుకుంటున్న సుమతి



మృతి చెందిన బాలుడు

చిత్తూరు అర్బన్: అత్త, ఆడపడుచు వేధింపులు భరించలేక బిడ్డతో కలిసి చనిపోవాలని ప్రయత్నించిన మహిళకు కన్నీళ్లే మిగిలాయి. భవనం పైనుంచి బిడ్డ సహా తల్లి కిందకు దూకింది. ఈ ఘటనలో ఐదేళ్ల బాబు చనిపోగా, తల్లి ఆస్పత్రిపాలైంది. చిత్తూరు నగరంలో గురువారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వన్ టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు... చిత్తూరు కట్టమంచికి చెందిన హరికి దేవళంపేటకు చెందిన సుమతితో ఆరేళ్ల కిందట పెళ్లయింది. వీరికి యశ్వంత్ (5) కుమారుడు ఉన్నాడు. హరి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మేస్త్రీగా పనిచేస్తూ పది నెలల కిందట చనిపోయాడు. అతను బతికున్న సమయంలోనే కలిసి ఉండలేనంటూ సుమతి కోర్టులో విడాకుల కోసం కేసు చేసి దాఖలు చేసింది. హరి మరణాంతరం కారుణ్య నియామకం కింద ఉద్యోగం తనకు ఇవ్వాలని అధికారులకు దరఖాస్తు పెట్టుకుంది. దీనిపై హరి తల్లి కుప్పమ్మ, సోదరి కుమారి అభ్యంతర వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. కారుణ్య నియామకంపై హైకోర్టు స్టే ఇవ్వడంతో సుమతి, ఆమె అత్త, ఆడపడుచు మధ్య వివాదాలు తలెత్తాయి. సోమవారం చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లె సత్యనారాయణ పురం లోని తన అక్క వద్ద ఉంటున్న సుమతి తీవ్రంగా కలత చెందింది. ఉద్యోగం రాకుండా తనను మానసికంగా వేధిస్తున్నారని కుటుంబ సభ్యులకు చెప్పి, అక్క ఇంటి మిద్దె పైకి ఎక్కి బిడ్డ యశ్వంత్‌తో కలసి సుమతి కిందకు దూకేసింది. గమనించిన స్థానికులు వెంటనే తల్లీ,బిడ్డను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. యశ్వంత్ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు పేర్కొన్నారు. సుమతి స్వల్ప గాయాలతో కోలుకుంటోంది. అత్త, ఆడపడుచు వేధింపుల కారణంగా సుమతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. యశ్వంత్ మత దేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించి.. వన్ టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాలి భానుప్రకాష్‌ను అరెస్టు చేయాలి



గాలి భానుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

- మంత్రి రోజాను దూషించడంపై వైఎస్సార్ సీపీ ఆగ్రహం
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

నగరి : మంత్రి ఆర్కేరోజాను ఉద్దేశించి టీడీపీ నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ చేసిన అసభ్యకర పదజాలాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. మహిళా మంత్రిని ఉద్దేశించి అది, ఇది అంటూ పత్రికల్లో రాయలేని పదజాలాలు వాడిన భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం సాయంత్రం ఏఎస్ఐ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. అనంతరం టవర్ క్లాక్ సెంటర్‌లో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పార్టీ మహిళా నాయకులు మాట్లాడుతూ మహిళ అని కూడా గౌరవించకుండా నీచ పదజాలంతో దూషించిన భానుప్రకాష్ లాంటి వ్యక్తులు సమాజానికి చీడపురుగులని, అలాంటి వారు సమాజంలో సంచరించడం ప్రమాదకరమన్నారు. పార్లమెంటు స్థాయిలో మహిళా బిల్లును పాస్ చేసి గౌరవించి, వారి అభివృద్ధికి ప్రోత్సహిస్తుంటే భానుప్రకాష్‌లాంటి వ్యక్తులు చేసే దిగజారుడు వ్యాఖ్యలు యావత్ మహిళాలోకం తలదించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. భాను ప్రకాష్ లాంటి మహిళా విద్వేషకులను అరెస్టు చేసి, మహిళా లోకానికి గౌరవాన్ని కల్పించాలన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉండకుండగా భాను ఇంట్లో దాక్కుంటే, మంత్రి ఆర్కే రోజా మహిళ అయినా ఏ మాత్రం వెనకడుగు వేయక ప్రజలకు అండగా నిలబడ్డారని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజల మధ్యలో తిరుగుతూ సమస్యలపైనా స్పందిస్తున్నట్లు ఓటు ప్రేమను భాను ఒలకబోస్తున్నాడన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక మంత్రిని, ఆమె కుటుంబ సభ్యులను నీచ పదజాలాలతో దూషించడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణించాలని తెలిపారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు సంబంధిత ఆధారాలు ఉన్నాయని, వాటి ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకుంటే మహిళల ఉద్యమాలు తప్పవన్నారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఎంపీపీ భార్గవి మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా బహిరంగంగా భాను చేసిన వ్యాఖ్యలను తీవ్రమైన నేరంగా పరిగణించాలని కోరారు. మహిళా నాయకులు సాయిసంధ్యరాణి, శశికళ, చంద్రకళ, చినపాప, వెన్నిల, జ్యోతి, గిరిజాకుమారి, కామాక్షి, నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 66,336 మంది స్వామివారిని దర్శించుకోగా.. 25,857 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.2.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.